ప్రజాశక్తి
ఆదివారం 31 ఆగస్టు 2025

సుస్థిర గిరిజనాభివృద్ధికి సిటియు ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ హైదరాబాద్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మధ్య గిరిజనాభివృద్ధి కోసం అవగాహన ఒప్పందం కుదిరింది. ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం.సుందరం అధ్యక్షతన శనివారం జరిగిన ఈ సమావేశంలో ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ సిఎన్ నీరజ, డాక్టర్ అమ్‌తుల్ వారిస్, డాక్టర్ ఎపి పద్మకుమారి, బి. శ్రీదేవి, డాక్టర్ పాపారావు వైకుంఠపు పాల్గొన్నారు. సిటియు తరపున వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, అసోసియేట్ ప్రొఫెసర్ అనిరుధ్ కుమార్ పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలతో సిటియు, ఐఐఆర్ఆర్ ప్రతినిధులు

తల్లికి వందనం ఏదీ?

పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పేరిట వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జూన్ 13న డబ్బులు జమ చేసింది. అనేక కారణాలతో జమకాని వారికి జులైలో చెల్లించింది. కానీ మండలంలోని అక్కివరం మోడల్ స్కూలులో నేటికీ 136 మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద డబ్బులు చెల్లించలేదు. దీంతో వారి తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిగుతున్నారు.

- ఆదర్శ పాఠశాలలో 136 మందికి ఎసరు
- ఒకే పేరుతో అందరి వివరాలు నమోదు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో కొందరు విద్యార్థులకు కరెంట్ బిల్లు ఎక్కువగా ఉండడం, ఆధార్‌లో తప్పులు, అకౌంట్ నెంబరులో తప్పులు ఉండడం, విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు కాకపోవడంతో వందల మందికి తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు రాలేదు. కానీ అక్కివరం మోడల్ స్కూలులో 136 మంది విద్యార్థులకు ఒకే పేరు మీద యాడ్ కావడంతో ఆ విద్యార్థులందరికీ తల్లికి వందనం వర్తించలేదు. పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు సుమారు 5వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సుమారు 200 మంది విద్యార్థులకు మొదటి దఫా తల్లికి వందనం డబ్బులు పడలేదు. అయితే పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు డబ్బులు పడకపోవడానికి కారణాలను తెలుసుకొని మళ్లీ ఆన్‌లైన్ చేసుకున్నారు. తరువాత 70 మంది వరకు పథకం వర్తించింది. ఇంకా మిగిలిన 136 మందికి కొల్లి స్వప్న పేరు మీదు వివరాలు నమోదు కావడంతో వీరెవరికీ డబ్బులు రాలేదు. ఈ కొల్లి స్వప్న ఎవరు? ఎక్కడ చవుతుతోంది? వంటి వివరాలను ఎవరికీ తెలియలేదు. ఈ స్వప్న పేరు మీద జిల్లాలో సుమారు 15 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రం మొత్తం మీద ఈమె పేరు సుమారు 1,50,000 మంది విద్యార్థుల పేర్లు యాడ్ అయ్యాయని, వీరెవరికీ తల్లికి వందనం వర్తింప కాలేదని అధికారులు అంటున్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడినప్పటికీ చివరకు నిరాశే మిగిలింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో చేసిన తప్పులకు మా పిల్లలకు తల్లికి వందనం రాకపోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పులను సవరించి తల్లికి వందనం పడేటట్లు సరిచేయాలని కోరుతున్నారు.

ప్రాసెస్‌లో ఉన్నాయి

ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా 136 మందికి తల్లికి వందనం రాకపోవడం వాస్తవమేనని తెలిపారు. అయితే ఒకే పేరుపై మిగతా విద్యార్థుల వివరాలు యాడ్ కావడంతో రాలేదని, సిబ్బంది ద్వారా మళ్లీ ఆన్‌లైన్ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉన్నాయని, త్వరలోనే డబ్బులు పడతాయని తెలిపారు. ఈ విషయమై ఎంఇఒ సాయికృష్ణను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. వివరాలు సరి చేసి పంపితే పథకం వర్తిస్తుందని తెలిపారు.

ఇద్దరికి ఒకటే బస్తా

ఎరువుల కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - గజపతినగరం

రైతుల సమస్యల పట్ల పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ముందుచూపు లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. యూరియా కోసం రోజుల తరబడి రైతులు ఎక్కడో ఒకచోట ఆందోళనలు చేస్తుండటమే అందుకు నిదర్శనం. ఎరువుల కోసం రైతులు గగ్గోలు పెడుతున్నా... పాలకులు పెడచెవిన పెడుతున్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని ఉన్నతాధికారులు ప్రకటించడం తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు అవస్థలు తప్పడం లేదు. యూరియా కోసం తెల్లారేసరికి రైతు సేవా కేంద్రం వద్ద కాపలా కాస్తే, అరబస్తా చేతిలో పెట్టడంతో అవాక్కవడం రైతుల వంతైంది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

పాతబగ్గాం రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

మండల వ్యాప్తంగా ఖరీఫ్ వరినాట్లు వేసి దాదాపు 20 రోజులు గడిచిపోయింది. ఎరువుల కొరతతో మొదటి దఫా యూరియా వెయ్యలేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో శనివారం మండలంలోని కొత్తబగ్గాం, పాతబగ్గాం రైతు సేవా కేంద్రాల్లో ఆయా పరిధిలోని రైతులకు ఎరువులు పంపిణీ చేస్తారని వ్యవసాయ శాఖ సిబ్బంది సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు ఆర్ఎస్‌కెల వద్ద పడిగాపులు కాశారు. కొత్తబగ్గాం రైతు సేవా కేంద్రం వద్ద సాలిపేట రైతులకు ఎరువులు ప్రశాంతంగా పంపిణీ చేశారు. పాతబగ్గాం రైతు సేవా కేంద్రం వద్ద బంగారంపేట, భూదేవిపేట, పాతబగ్గాం రైతులకు ఎరువుల పంపిణీలో గందరగోళం చోటుచేసుకుంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ అక్కడికి చేరుకుని, రైతుల సమస్య తెలుసుకుని, విఎఎ సునీతతో మాట్లాడారు. వెంటనే రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సచివాలయ పరిధిలో మూడు గ్రామాలకు 130 బస్తాల యూరియా మాత్రమే వచ్చినట్లు విఎఎ తెలిపారు. రైతులకు సరిపడా యూరియా లేదని ఎఒ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. మూడు గ్రామాల పెద్దలతోపాటు ఎఒ కిరణ్ కుమార్ అక్కడికి చేరుకుని, రైతులతో చర్చించారు. చివరికి ఇద్దరు రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేయాలని నిర్ణయించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అరబస్తా చొప్పున రైతులు తీసుకోవాల్సి వచ్చింది. నాట్లు వేసి రెండు, మూడు వారాలు గడుస్తున్నా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రయివేటు ఎరువుల దుకాణాలకు వెళ్లక తప్పదని వాపోయారు. కార్యక్రమంలో బంగారంపేట సర్పంచ్ సత్తిబాబు, పాతబగ్గాం మాజీ సర్పంచ్ లెంక చిన్నంనాయుడు, టిడిపి నాయకులు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కె సిబ్బందితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్

పంచాయతీరాజ్ కమిషనర్ విస్తృత పర్యటన

తెర్లాం మండలం ఎంఆర్ అగ్రహారంలో ల్యాప్‌టాప్‌లో స్వర్ణ పంచాయతీ వివరాలు పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణతేజ

ప్రజాశక్తి -బొబ్బిలి, బొబ్బిలిరూరల్, తెర్లాం

జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ శనివారం విస్తృతంగా పర్యటించారు. బొబ్బిలి మండలంలోని మెట్టవలస, జగన్నాథపురం గ్రామాల్లో పర్యటించి, సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, స్వమిత్వ, ఇంటి పన్నుల వసూళ్లపై ఆరాతీశారు. పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జగన్నాథపురంలో డిఎల్‌డిఒ కార్యాలయ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిపిఒ మల్లికార్జున, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ , డిఎల్‌డిఒ కిరణ్ కుమార్, ఎంపిడిఒ రవికుమార్, డిప్యూటీ ఎంపిడిఒ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ సామగ్రి పరిశీలన

బొబ్బిలి యుద్ధంలో వాడిన ఆయుధాలను కమిషనర్ కృష్ణతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా బొబ్బిలి యుద్ధ చరిత్రను ఎమ్మెల్యే బేబినాయన ఆయనకు వివరించారు. యుద్ధంలో వాడిన ఆయుధాలను చూడడం ఎంతో ఆనందంగా ఉందని కృష్ణచైతన్య అన్నారు.

కార్యదర్శి ఎవరు?

తెర్లాం మండలంలోని ఎంఆర్ అగ్రహారం గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ సందర్శించారు. సచివాలయంలో కార్యదర్శి ఎవరు? అంటూ ఆయన మొదలెట్టారు. కార్యదర్శి వద్దనున్న ల్యాప్‌టాప్‌లో స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ని ఓపెన్ చేయాలని కమిషనర్ అడిగారు. కార్యదర్శి ల్యాప్‌టాప్ ఓపెన్ చేయడంతో దాన్ని పరిశీలించి, అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంతో ఎంపిడిఒ ఆర్.రాంబాబు, ఇఒపిఆర్‌డి నీలిమ, పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్ కుమార్, నాయకులు లొట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

పనులు ఏవిధంగా జరుగుతున్నాయ్?

చీపురుపల్లి : మండలంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు ఏవిధంగా జరుగుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆరా తీశారు. శనివారం చీపురుపల్లి వచ్చిన ఆయన డిఎల్‌డిఒ కార్యాలయాన్ని సందర్శించారు. పంచాయతీ పరిధిలోని సచివాలయం -3ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో ఆయన మండలంలో జరుగుతున్న పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఐ.సురేష్, డిఎల్‌డిఒ హేమసుందర్, మండల పరిషత్ సిబ్బంది కమిషనర్‌ని సత్కరించారు.

జెడ్‌పిని సందర్శించిన పిఆర్ కమిషనర్

కంటోన్మెంట్ : పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇటీవల మంజూరైన డిఎల్‌డిఒ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం జెడ్‌పి చైర్మన్‌తన ఛాంబర్ లో కృష్ణతేజను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ వెంకటరామన్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కామ్రేడ్.. ఏమిటి చెప్పండి?

బొబ్బిలిరూరల్ : రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ పర్యటన సందర్భంగా ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. బొబ్బిలి మండలం జగన్నాథపురంలో కమిషనర్ పర్యటిస్తుండగా, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు సిఐటియు నాయకులు ఆయన వద్దకు వెళ్లారు. వారిని చూసిన కృష్ణతేజ.. 'కామ్రేడ్.. ఏమిటి చెప్పండి' అంటూ పలకరించారు. ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వరకు గ్రీన్ అంబాసిడర్ల వేతన బకాయిలు ఉన్నాయని సిఐటియు జిల్లా నాయకులు కె.సురేష్.. ఆయనకు విన్నవించారు. అందుకు సంబంధించి వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందించారు. వెంటనే స్పందించిన కమిషనర్ కృష్ణతేజ.. డిపిఒ మల్లికార్జునతో మాట్లాడి సంబంధిత ఫైల్ పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల రామారావు, పైడితల్లి పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు సురేష్

విజయనగరం కీర్తిని పెంచేలా పండగ

ఉత్సవాల నిర్వహణకు రూ.50 లక్షలు మంజూరు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కీర్తిని పెంచేవిధంగా ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగ జరగాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాలపై శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్టోబర్ 6,7 తేదీలలో జరగబోయే పైడితల్లి అమ్మ వారి ఉత్సవాలు భక్తుల్లో మధురానుభూతిని కలిగించేలా నిర్వహించాలని అన్నారు. గత ఏడాది కంటే గొప్పగా నిర్వహించాలని తెలిపారు. ఉత్సవాలకు వారం రోజుల ముందు నుండే నగరమంతా విద్యుత్ కాంతులతో అలంకరించాలని, తాగునీటి సరఫరా , పారిశుధ్యం , నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిరిమాను ఊరేగింపు 3 గంటలకే మొదలు పెట్టాలని, 5 గంటలకు ముగించాలని సూచించారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ శాఖల వారీగా ఎవరెవరు ఏ ఏ పనులు చేయాలో ఆదేశించారు. సాధారణ దర్శనాలకు ఇబ్బంది కలగకుండా విఐపి దర్శనాలను ఏర్పాటు చేయాలని దేవాలయ అధికారులకు ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, మెడికల్ క్యాంపు, 108 వాహనం ఏర్పాటు చేయాలని తెలిపారు. సిరిమాను రథం ఫిట్నెస్‌ను అటవీ అధికారులు తనిఖీ చేయాలని, ఆర్‌డిఒ, అటవీ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. భక్తులు వచ్చే రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని, ఆర్.టి.సి అధికారులకు ఆదేశించారు. ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.50లక్షలు కేటాయించిందని, నిధులు విడుదల కోసం డిఒ లేఖ రాశామని తెలిపారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ సమన్వయం తో పని చేసి పండగను విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్‌పి వకుల్‌జిందల్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల కోసం 2 వేల మంది పోలీసులను నియమిస్తామని తెలిపారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైడితల్లి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పైడితల్లమ్మ పండగ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పి, జెసి

అర్ధనగ్నంగా నిరసన చేపడుతున్న నిర్వాసితులు

జిందాల్ నిర్వాసితుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కంపెనీ పేరుతో భూములు తీసుకొని, తెగనమ్మడానికి సిద్ధపడ్డ జిందాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బొడ్డవర వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసితులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ భూములు ఇచ్చిన నిర్వాసితులకు కంపెనీ ఏర్పాటుచేసి, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి జిందాల్ పరిశ్రమ యాజమాన్యం మోసగించిందన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులు ఉపాధికి దూరమై, ఉద్యోగాలూ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే భూములను తిరిగి నిర్వాసితులకు అప్పగించాలని అధికారులను డిమాండ్ చేశారు. దళిత, గిరిజన నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

జిల్లాలో జెజెఎం అమలు భేష్

అభినందించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇంటింటికీ తాగు నీటిని అందించేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ అమలు తీరు జిల్లాలో ప్రశంసనీయంగా ఉందని కేంద్ర బృందం అభినందించింది. బృందం సభ్యులు కలెక్టర్ ఛాంబర్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను శనివారం కలిసి, పథకం అమలుపై చర్చించారు. కేంద్ర జల్ జీవన్ మిషన్ బృందంలో వాష్ నిపుణులు ప్రకాష్ చంద్ర నాయక్, గోకుల్ సేతురాజ్, కె.టి. నాగరాజ్ ఈ నెల 26 నుండి 5 రోజుల పాటు ఎస్. కోట, దొర్లపాలెం, చీపురుపల్లి మండలం రామలింగాపురం, పూర్రేయవలస, గరివిడి మండలం అప్పన్నవలస తదితర గ్రామాల్లో పర్యటించి జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ అమలు తీరును పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి స్పందన తెలుసుకున్నారు. ఈ పథకాలు జిల్లాలో చక్కగా అమలవుతున్నాయని అభినందిస్తూ, మరింత పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సురక్షితత్రాగు నీరు అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని, పథకాన్ని సంపూర్ణంగా, మరింత పటిష్ఠంగా అమలు చెయ్యాలని కోరారు. బృందంతో బాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, అర్.డబ్ల్యూ. ఎస్‌ఇ కవిత పాల్గొన్నారు.

కేంద్ర బృందంతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రాజాం

సిఐటియు 11వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల రథసారథి ఉద్యమాల వేగుచుక్క అయినా సిఐటియు 11వ జిల్లా మహాసభలు రాజాంలో నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ముఖ్య అతిథులుగా హాజరు అవుతున్నారని తెలిపారు. రాజాంలో సెప్టెంబర్ 7వ తేదీన ఉదయం 10 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి కార్మికులతో ర్యాలీ నిర్వహించి అనంతరం సభ ప్రారంభిస్తామన్నారు. ఈ మహాసభలో జిల్లాలో పరిశ్రమ మూసివేతపైన, కొత్త పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగ సమస్య రోజు రోజుకి పెరుగుతుందని చెప్పారు. స్కీం వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు కాకుండా ఉద్యోగ భద్రత లేకుండా అనేక రాజకీయ వేధింపులకు గురవుతున్నారన్నారు. భవన నిర్మాణం, కళాసి, ఆటో, విఆర్ఎ, పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్స్, ఫీల్డ్ అసిస్టెంట్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగులకు, కార్మికులకు సంక్షేమం లేదని ఆగ్రహించారు. రోజురోజుకు నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో ఆదాయానికి ఖర్చుకి చాలా వ్యత్యాసం పెరిగిందని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేసి భవిష్యత్తులో జిల్లాలో ఉద్యమాలకు ఈ మహాసభలు వేదిక కాబోతున్నాయన్నారు. ఈ మహాసభలను జయప్రదయానికి జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగాలు, కార్మికులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ.జగన్మోహన్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాథ్, కె.అసిరప్పుడు, మున్సిపల్ యూనియన్ నాయకులు పి.కనకరాజు, ఆశా నాయకులు సీహెచ్.ఉమా, భవన నిర్మాణ నాయకులు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉన్నత విద్యే భవిష్యత్తుకు పునాది

ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఇటీవల పదో తరగతి, ఇంటర్, బి.టెక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి, మంచి మార్కులతో ఫలితాలు సాధించిన పోలీసు ఉద్యోగుల పిల్లలను జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసా పత్రాలను, మెరిట్ స్కాలర్ షిప్ లను శనివారంఅందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని, అందుకు తగిన విధంగా విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో తమ చదువులను కొనసాగించి, మంచి ఫలితాలను సాధించాలన్నారు. పోలీసు ఉద్యోగుల పిల్లలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో వారు సాధించిన మార్కులు ఆధారంగా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం 87 మంది విద్యార్థులకు రూ.16,54,000 స్కాలర్ షిప్‌లు మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి వారు సాధించిన మార్కులు ఆధారంగా రూ.10 వేలు నుండి రూ.30వేలు వరకు మంజూరు చేసిన స్కాలర్ షిప్‌లను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు సాధించిన ర్యాంకులు ఆధారంగా మరో 11 మంది విద్యార్థులకు మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌గా రూ.6,95,000 చీఫ్ ఆఫీసు మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.25వేలు నుండి రూ.1.20 లక్షలను మెరిటోరియస్ స్కాలర్‌షిప్ త్వరలో అందించనున్నట్లు ఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, వెల్ఫేర్ ఆర్‌ఐ ఎన్.గోపాల నాయుడు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎస్‌పి వకుల్ జిందల్

లాటరీ ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి మాధవన్

బార్ షాపులకు లాటరీ

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ శాఖ లాటరీ విధానం ద్వారా ఓపెన్ కేటగిరి బార్ల కేటాయించింది. శనివారం మన్యం జిల్లాలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో, విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో జెసి సేతు మాధవన్ సమక్షంలో మద్యం బార్ షాపులకు డ్రా నిర్వహించారు. విజయనగరం జిల్లాలో 14 బార్లకు, మన్యం జిల్లాలో 4 బార్లకు లాటరీ విధానం ద్వారా కేటాయించారు. విజయనగరంలో 71 దరఖాస్తులు ద్వారా రూ.3.62 కోట్లు, మన్యం జిల్లాలో 19 దరఖాస్తుల ద్వారా రూ. 96.9 లక్షలు వచ్చాయని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ చౌదరి, జిల్లా మద్య నిషేధ, అబ్కారి శాఖ అధికారి బమ్మిడి శ్రీనాథుడు తెలిపారు.

అన్నదాతపై అలక్ష్యం తగునా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒక్కనాడు అదును... ఏడాది బతుకు అంటారు. ఈ సామెత ఉత్తరాంధ్రాలోనూ ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ అక్షరాల నిజమే. కురుస్తున్న వర్షపునీటి ఆధారంగానే వరినారుగానీ, ఉబాలుగానీ పట్టేది. చివరికి పంట పండేవరకు మెజార్టీ సాగుభూమికి వర్షపునీరే ఆధారం. అందుకే ఎన్ని పనులున్నా వాన పడగానే చినుకు నీటిని ఒడిసిపట్టి వెంట వెంటనే ఉబాలు పడుతుంటారు. కానీ, ఈ ఏడాది వర్షాలు పడినా, సాగునీటి ప్రాజెక్టుల చివరి ఆయుకట్టుకు నీరు చేరలేదు. 1.20లక్షల ఎకరాల ఆయుకట్టుగల తోటపల్లి బ్యారేజీ ఆయుకట్టులో పట్టుమని పాతికవేల ఎకరాలకు మించి సాగునీరు అందలేదు. మిగిలిన జలాశయాల కిందా ఇదే పరిస్థితి. జలాశయాల్లో నీరు ఉన్నప్పటికీ, కాలువల నిర్వహణ ప్రభుత్వాలు గాలికి వదిలేయడమే ఇందుకు కారణం. దీంతో, మోటార్లు పెట్టుకుని మరీ పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు, పెసలు, మినుములు, తదితర 16 రకాల పంటలు 2,92,482 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా ఇప్పటి వరకు 2,35,240 (80శాతం) ఎకరాల్లో సాగైంది. ఇందులోనూ అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,28,035 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,90,540 ఎకరాల్లో (84శాతం) సాగైంది. ఈ దశలో వరి వేరుతన్నడానికి, ఎదుగుదలకు

యూరియా, ఎడిపి వంటి ఎరువులు విరివిరిగా అవసరం కాగా, జిల్లాలో ఎక్కడా అందుబాటులో లేదు. ఉన్న కొద్దిపాటి ఎరువులను ప్రైవేటు డీలర్లు బ్లాక్‌చేసి, అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. రైతు సేవాకేంద్రాలు, పిఎసిఎస్‌ల ద్వారా కేటాయించిన ఎరువులు రాజకీయ నాయకుల వంతయ్యాయి. అధికారుల లెక్కల ప్రకారం వివిధ పంటల సీజనల్ కండీషన్ బట్టి జిల్లా వ్యాప్తంగా 32,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆగస్టు ప్రారంభం నాటికి వచ్చింది కేవలం 24,360 మెట్రిక్ టన్నులు మాత్రమే. దీన్నిబట్టి 8,240 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్టుగా స్పష్టమౌతోంది. దీనిపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నవ్విపోదరుగాక నాకేంటి? అన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ వీరు జోక్యం చేసుకోకపోవడం దారుణమని జనం చర్చించుకుంటున్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న ప్రైవేటు డీలర్లు యూరియా బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో యూరియా దొరకడమే గగనం అంటూ సెలవిస్తున్నారు. దీంతో, అదునుకు గుండా పిండీ వేయలేకపోతే గింజలెలా పండుతాయని, ఏడాది పొడవునా బతుకెలా ఈడుస్తామని రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అయినా పాలకుల్లో ఇసుమంత స్పందన కనిపించడం లేదని వాపోతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

లే అవుట్ క్రమబద్ధీకరణను వినియోగించుకోండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం అమలుకు మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉన్నందున ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రణాళిక కార్యదర్శులకు ఆదేశించారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర క్రమబద్ధీకరణతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం అమలుకు మరో రెండు నెలలు మాత్రమే గడువును ఉన్నందున దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని తెలిపారు. అనధికార కట్టడాలను, నిర్మాణాలను ఉపేక్షించవద్దని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వయోజన విద్య జిల్లా ఎంపిక కమిటీ, పాఠశాల విద్యా శాఖలో ఎస్‌జిటిలు/పిఇటిలు/గ్రేడ్ 2 భాషా పండితులుగా పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయుల నుంచి (45 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు) సూపరువైజరుగా డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఒక ప్రకటన లో తెలిపారు. ఫారిన్ సర్వీస్ నిబంధనల కింద డిప్యుటేషన్‌పై ఒక ఏడాది పాటు జిల్లాలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల కోసం దరఖాస్తులను ఉపసంచాలకులు, వయోజన విద్య, విజయనగరం కార్యాలయంలో సెప్టెంబర్ 5లోగా అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఉపసంచాలకులు, వయోజన విద్య వారి కార్యాలయం, ఫోన్ 8247012136, 8309589767 సంప్రదించాలని కోరారు.

బూత్ ఇన్‌ఛార్జుల నియామకం

బొండపల్లి : వైసిపి బొండపల్లి మండల బూత్ ఇన్‌ఛార్జులుగా మహంతి రమణ, పల్లి రఘు, తాడ్డి చంద్రరావును మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నియమించారు. ఈ సందర్భంగా అప్పలనరసయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, గజపతినగరం జెడ్‌పిటిసి గార తవుడు, బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కావలి సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని కావలి గ్రామ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకులు టి.రవీంద్రనాయుడు శనివారం తుదిశ్వాస విడిచారు. అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోని చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. ప్రజా నాయకుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రవీంద్రనాయుడు 15ఏళ్ళుగా గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కావలి గ్రామంలో ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రవీంద్రనాయుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల గ్రామస్తులు, మండల ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

సమయపాలన పాటించాలి

నెల్లిమర్ల : సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఇంచార్జి ఎంపిడిఒ పి.సుదర్శనం సూచించారు. శనివారం ఆయన సారిపల్లి, రామతీర్థం, తంగుడుబిల్లి సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాన్ని 10గంటలకు తెరిచి సిబ్బంది హాజరై ఆయా గ్రామస్థులకు ఇబ్బదులు కలగకు

కుళాయిల ద్వారా రంగునీరు

విజయనగరం టౌన్ : నగరంలో కొన్ని ప్రాంతాలలో రంగు మారిన నీరు సరఫరా అవుతున్నట్లు తెలుసుకున్న నగరపాలక సంస్థ సిబ్బంది కమిషనర్ ఆదేశాలతో కారణాలను అన్వేషించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ నుండి కొత్తనీరు వచ్చి చేరడం ఒక కారణంగాను, మరోవైపు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కొద్దిగా రంగు మారిన నీరు వచ్చి చేరుతున్నట్లు గుర్తించారు. దీంతో ప్రాథమికంగా నగర వ్యాప్తంగా నీటి పంపిణీని కొంత సమయం పాటు నిలుపుదల చేశారు. వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరిచారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శనివారం సందర్శించారు. సచివాలఅంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. సోంపురం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి కె.రామప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు అధికారులను డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జ్యూట్ మిల్లు స్థలంలో ప్రభుత్వ భూమి, ఇరిగేషన్ కాలువ ఉందని, ఆయా భూములను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇండస్ట్రీయల్ భూమి నుంచి నివాస భూమిగా మార్చేందుకు ఎటువంటి అభ్యంతరమూ లేదని సర్టిఫికెట్ ఇవ్వాలని, అందుకు మున్సిపాలిటీకి ఆస్తిపన్ను చెల్లిస్తామంటూ మధ్యవర్తులు ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. కౌన్సిల్లో చర్చలేకుండా జ్యూట్ మిల్లు స్థలానికి ఎన్‌ఒసి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఆయనతో కౌన్సిలర్లు ఎస్.బాబు, పాలవలస ఉమా శంకర్ ఉన్నారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గరివిడి

సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఎపిసిపిఎస్‌ఇఎ ఆధ్వర్యాన సెప్టెంబర్ 1 న తలపెట్టిన "చలో విజయవాడ" కార్యక్రమానికి మద్దతుగా ప్రచార పోస్టర్‌ను కాపు శంభాం జెడ్‌పి హైస్కూలులో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల నాయకులు పి జగన్నాథ రావు, యుటిఎఫ్ నాయకులు బి.రాజశేఖర్, సూరి శ్రీను, ఎస్‌ఎల్‌టిఎ నాయకులు సిహెచ్‌సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యువత

విజయనగరం టౌన్ : జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకష్ణారావు (బాలు), 42వ డివిజన్, కామాక్షినగర్, అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాయికృష్ణా వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ మాట్లాడారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

రేగిడి : వావిలివలస పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన నడిపిల్లి వెంకటరమణకు రాహుల్ సౌరబ్ నిత్యాన్నదాన సత్రంలో శనివారం శాలువాతో సన్మానించారు. గ్రామంలో సుమారు 8 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పని చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని సత్రం నిర్వాహకులు, సామాజిక కార్యకర్త పాలూరు సిద్ధార్థ తెలిపారు

ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఆక్రమణలు తొలగించాలని వైసిపి, టిడిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం చైర్మన్ రాంబార్కి శరత్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. బజారు, చిన బజారులో రోడ్డుకు ఇరువైపులా తోపుడు బళ్లు, షాపులను పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని టిడిపి కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు అన్నారు. మేదరబంద జంక్షన్లో కూడా ఆక్రమణలు జరుగుతున్నాయని వైసిపి కౌన్సిలర్ జి.రమాదేవి సమావేశంలో లేవనెత్తారు. దీంతో మిగిలిన కౌన్సిలర్లు జోక్యం చేసుకుని ఆక్రమణలు తొలగించాలని పట్టుబట్టారు. ఆక్రమణలు పూర్తిగా తొలగిస్తామని, ఎవరూ జోక్యం చేసుకోవద్దని కమిషనర్ రామలక్ష్మి కోరారు. రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు వేరే చోట స్థలం చూపించి తొలగించాలని మూడో వార్డు కౌన్సిలర్ బొత్స సురేష్ కోరారు.

మున్సిపల్ కౌన్సిల్ అనుమతులు పొందిన పనులను ఎందుకు రద్దు చేశారని కౌన్సిలర్ ఇంటి గోవిందరావు ప్రశ్నించారు. పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాని వాటిని రద్దు చేసినట్లు కమిషనర్, చైర్మన్ శరత్ చెప్పారు. జ్యూట్ మిల్లు స్థలంలో ఇరిగేషన్ కాలువ, ప్రయివేట్, ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఇంటి గోవిందరావు కోరారు. మల్లమ్మపేటలో సమస్యలు పరిష్కరించడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. బైపాస్ రోడ్డు మరమ్మతులు ఎమ్మెల్యే బేబినాయన సొంత నిధులతో చేస్తామని చెబితే మున్సిపల్ నిధులు ఎందుకు కేటాయించారని డిఇ కిరణ్ కుమార్‌ను కౌన్సిలర్ ఇంటి గోవిందరావు ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఐదు నెలలుగా సమావేశానికి రాకపోతే హాజరైనట్లు ఎవరు సంతకం చేశారని కౌన్సిలర్ సావు శారద ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి

అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మిగజపతిరాజు అన్నారు. శనివారం విజయనగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందన్నారు. వాటిని గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. అన్ని పంచాయతీలకు సమానంగా నిధులు సర్దుబాటు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. మండలంలో వ్యవసాయ రంగానికి నీటిపారుదల రంగానికి అధికారులు త్వరితగతిన అవసరమైన చర్యలు తీసుకొని పూర్తి చేయాలన్నారు. మండల పరిషత్ సమావేశాలు అజెండా కాపీలు ముందుగా అందజేయడం లేదన్నారు. ఎంపిపి అప్పలనాయుడు మాట్లాడుతూ 1994 సెక్షన్ 23 ప్రకారం అధ్యక్షులు అప్పటికప్పుడు ప్రతిపాదించి ఆమోదించి నిర్ణయాలు తీసుకోవచ్చు అన్నారు. 22 పంచాయతీల్లోను అభివృద్ధి కార్యక్రమాలకు చర్యలు చేపట్టాలన్నారు సమావేశంలో ఎఎంసి చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు, పలువురు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు కృషి : నాగార్జున

ప్రజాశక్తి - డెంకాడ

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద తాడివాడ వద్ద ఉన్న పిబిఆర్ కళ్యాణ మండపంలో శనివారం 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మహిళలకు సాధికారత మాత్రమే కాకుండా తిరిగి లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇస్తున్నారన్నారు. మహిళలకు సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. ఇందులో భాగంగానే శ్రీశక్తి ఉచిత బస్సు పథకం, 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం ఇలా ఒక్కొక్కటి మహిళల పేరు మీద ప్రవేశపెట్టి ఇస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు నేడు సూపర్ హిట్ అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు అబ్దుల్ నజీర్ టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, టిడిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, పూసపాటిరేగ, భోగాపురం మండలాల పార్టీ అధ్యక్షులు మహంతి శంకరరావు, కర్రోతు సత్యనారాయణ ఎఎంసి ఛైర్‌పర్సన్ గేదెల గాయత్రి, నాయకులు ఆకిరి ప్రసాద్‌రావు, గేదెల రాజారావు, పతివాడ శివరామవిద్యాసాగర్ నాయుడు, మైలపల్లి సింహాచలం, చిల్ల పద్మ, బొంతు ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పారాది వంతెన నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల పాత వంతెన కుంగిందన్నారు. దీంతో భారీ వాహనాలు బాడంగి, తెర్లాం మండలాల మీదుగా వెళ్లడంతో రోడ్లు అధ్వానంగా మారాయని చెప్పారు. రోడ్ల దుస్థితికి కారణమైన అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గ రోడ్లపై అసెంబ్లీలో ప్రస్తావించడంతో నిధులు మంజూరు చేశారన్నారు. పారాది వంతెన, బొబ్బిలి బైపాస్ రోడ్డు, బొబ్బిలి - తెర్లాం రోడ్డు, చిలకపాలెం - పార్వతీపురం రోడ్డు, పినపెంకి - బాడంగి రోడ్డు, బాడంగి నుంచి ముగడ మీదుగా బొబ్బిలి రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తామన్నారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తామన్నారు. ఆర్‌టిసి బస్సులో శుక్రవారం జరిగిన సంఘటన కొంతమంది కావాలనే చేశారని అనుమానం వ్యక్తంచేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రహీం షేక్‌లాల్ గుర్తింపు కార్డులను శనివారం హెచ్‌ఎం రామ్‌కుమార్ సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వర్రి భాస్కరరావు, చిప్పాడ శ్రీను, డివి సూర్యనారాయణ, విశ్వనాథం, ఉగ్గిన శ్రీను, స్వప్న, గోపి, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని గిరిజన గ్రామమైన దొంగరువలసలో శనివారం మామిడి రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నూజివీడు ఉద్యాన శాస్త్రవేత్త రాధారాణి మాట్లాడుతూ మామిడి పంట యాజమాన్యంలో భాగంగా కొమ్మల కత్తిరింపు, పునరుద్ధరణ, ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువులు, సస్యరక్షణ చర్యలపై వివరించారు. అనంతరం మామిడి సాగుపై ప్రస్తుతం ఆచరణలో ఉన్న పద్ధతులపై రైతులతో ముఖాముఖి చర్చించి, సందేహాలు నివృత్తి చేశారు. ఉద్యాన శాఖాధికారి ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీల గురించి తెలియజేశారు. జిల్లాలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద మామిడి పంట ఎంపికైందని, ఇకనుంచి మామిడికి సంబంధించి విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు వంటి పరిశ్రమలు మున్ముందు రాబోతున్నాయని చెప్పారు. మామిడి రైతులకు మంచి ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

తపాలాశాఖ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల ఆవశ్యకతను వివరిస్తూ ఎంఆర్ హైస్కూలు విద్యార్థులతో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్‌శాఖ ఆధ్వర్యాన ప్రతిజ్ఞ నిర్వహించారు. విద్యార్థుల్లో ఆటలు ఆరోగ్యం యొక్క ఆవశ్యకత అనే విషయంపై డిబేట్‌ను మహారాజ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించారు. 35 మంది విద్యార్థులు చాలా ఆసక్తి కరంగా పాల్గొని కె.లహరి బాయికి ప్రథమ, ఎస్‌వి మనోజ్ఞా ద్వితీయ. నంద కిశోర్ తృతీయ బహుమతులు సాధించారు. స్పోర్ట్స్ కోటా ద్వారా వుద్యోగం సంపాదించిన పలువురు తపాలా ఉద్యోగులను సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు సత్కరించారు. ఆదివారం హెడ్ పోస్టాఫీసు నుండి కోట, మూడు లాంతర్లు నుండి గంట స్థంబం మీదుగా తిరిగి హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను సిఎం చంద్రబాబు మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విమర్శించారు. పట్టణంలోని శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జోగిరాజుపేటలో కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. శనివారం స్థానిక ఎస్సై బి.గణేష్ అందించిన వివరాల ప్రకారం.. జోగిరాజుపేటకు చెందిన లెంక లావణ్య (25) గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతూ శుక్రవారం చీమల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. దీంతో హుటాహుటిన మిమ్స్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతురాలు తండ్రి కిల్లాన ఆదినారాయణ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఉపాధి కల్పనకు పెద్దపీట

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- బొండపల్లి

యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బొండపల్లి, అంబటివలస గ్రామాల్లో సచివాలయ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొండపల్లి ఈశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందన్నారు. పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళు న్నామని చెప్పారు. భవిష్యత్తు తరం బాగుండాలంటే సాంకేతికతను, నైపుణ్యాన్ని అందుపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రాంత రైతులను దృష్టిలో పెట్టుకొని ఎంఎన్ ఛానల్, బివి ఛానల్, 13 వంతుల కాలువ పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సామాజిక భద్రత పింఛన్ల విషయంలో వైసిపి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, దీనిలో ఏమాత్రమూ వాస్తవం లేదని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వరరావు, తహశీల్దార్ రాజేశ్వర రావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అరసాడ రఘుపతిరావు, సిడిపిఒ ఉమా భారతి, ఎఒ మల్లికార్జున రావు, పిఆర్ జెఇ అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సునీల్, ఎపిఎం పెంటంనాయుడు, ఎపిఒ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీలో వసంత ప్రతిభ

ప్రజాశకి-విజయనగరం టౌన్

నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు తిరుపతిలో ఈనెల 24,25,26 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.వసంత 100 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా అమెరికాలో నివాసముంటున్న చింతలపాటి సూర్యశిరీష రూ.25వేలు నగదు బహుమతిగా ప్రకటించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఆమె తల్లి పాకలపాటి జయలక్ష్మి పనిచేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్ జయపాల రావు, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, వసంత కు అభినందనలు తెలిపారు.

ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల ర్యాలీ

ప్రజాశక్తి-రామభద్రపురం

వేపాడలో నిరసన చేపడుతున్న ఆటో కార్మికులు

ఉచిత బస్సు సౌకర్యం వల్ల కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సిఐటియు ఆధ్వర్యాన శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక మూడు రోడ్ల కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆటో కార్మికుల సంఘం (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బలస శ్రీను, నాయకులు లోకేష్, రామకృష్ణ, వెంకటేష్, సోములు మాట్లాడుతూ కరోనా వల్ల ఆర్థికంగా దెబ్బతిని దినదిన గండంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లను ఉచిత బస్సు పథకం కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, జరిమానాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళి, రాజు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలో ఆటో యూనియన్ నాయకులు రాజు ఆధ్వర్యాన ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్‌చేశారు.

అధ్యక్ష పదవి రేసులో కర్రోతు

ప్రజాశక్తి- డెంకాడ

మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కర్రోతు సత్యనారాయణ

జిల్లా టిడిపి అధ్యక్ష పదవి రేసులో భోగాపురం మండల టిడిపి అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఉన్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎయిర్‌పోర్టులో కలిసి ఈసారి జిల్లా అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని కోరారు. టిడిపి ఆవిర్భావం నుంచి భోగాపురం మండలంలోని టిడిపి అధ్యక్షునిగా పనిచేస్తున్నానని, తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. తనకు అవకాశం ఇస్తే జిల్లాలో టిడిపి నాయకులను కలుపుకొని పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు కృసి చేస్తాని లోకేష్‌కు చెప్పినట్లు సత్యనారాయణ చెబుతున్నారు.

లోకేష్‌ను కలిసిన కంది

రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని తనకు ఇవ్వాలని కోరారు. అనంతరం పార్టీలో ఉండే విభేదాలు, పార్టీ బలోపేతం గురించి ఆయనకు వివరించారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: విశాఖపట్నంలో మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వారు లోకేష్‌కు వివరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - వంగర

చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శ్రీకాకుళం జిల్లా ఒమరవల్లి డైట్ అధ్యాపకులు ఎస్ ప్రసాదు అన్నారు. ఎం.సీతారాంపురం మోడల్ ప్రాథమిక పాఠశాలను డైట్ అధ్యాపకులు శనివారం తనిఖీ చేశారు. ఆయన ప్రార్థన సమయానికి ముందుగానే పాఠశాలకు చేరుకొని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు సమయాలను, ప్రార్థన తీరును పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మగ్గూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని పర్యవేక్షించారు.

జెఎన్‌టియులో క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివిలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శారీరక విద్య విభాగం ఆధ్వర్యంలో, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని పలు క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదాన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆర్. రాజేశ్వరరావు, వైస్-ప్రిన్సిపాల్ జి.జె. నాగరాజు అతిథులుగా హాజరై, విద్యార్థులను ప్రోత్సహించారు. విజేతలకు ట్రోఫీలు, పతకాలు, మరియు ధవపత్రాలు అందజేశారు. జెఎన్‌టియు జివి క్రీడల సమన్వయకర్త డాక్టర్ గొట్టాపు అప్పలనాయుడు మాట్లాడారు.

హెచ్‌ఐవిపై అవగాహనకు మారథాన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

హెచ్‌ఐవి, ఎయిడ్స్ పట్ల యువతకు మరింత అవగాహన కలిగిందచేందుకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యాన శనివారం ఇంటర్నేషనల్ యూత్‌డే సెలబ్రేషన్స్‌లో భాగంగా జిల్లాస్థాయి మారథాన్ 5కె రెడ్‌రన్ పరుగుపందేలను విజ్జీస్టేడియంలో నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నివారణఅధికారి డాక్టర్ రాణి, డిఎస్‌డిఒ శ్రీధర్ ఈ రన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ బద్రి, గిరిబాబు, శ్రీనివాస్, ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మారథాన్ వీజేతలకు త్వరలో జిల్లా అధికారుల చేతుల మీదుగానగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.